క్లుప్తంగా

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డారు. పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన హరీష్(23) నీరుగట్టువారి పల్లెలోని టమటా మార్కెట్‌లో కూలీగా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక సమస్యల కారణంగా మనస్థాపం చెంది మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే విధంగా మండలంలోని నల్లగుట్టపల్లెకు చెందిన స్వాతి(25) కుటుంబ సమస్యల కారణంగా మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబసభ్యులు బాధితులను ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

చికెన్ తక్కువ ధరకు అమ్మాడని దాడి

మదనపల్లె : చికెన్ వ్యాపారుల నిర్ణయానికి కట్టుబడి చికెన్ విక్రయించకుండా, తక్కువ ధరకు చికెన్ అమ్మాడని సహచర చికెన్ వ్యాపారులు మరో చికెన్ వ్యాపారిపై దాడి చేసిన సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన అబ్దుల్లా(38) స్థానిక రామారావుకాలనీలో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఈ ప్రాంతంలోని చికెన్ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి కిలో రూ.180 విక్రయించాల్సిందిగా నిర్ణయించారు. అయితే అబ్దుల్లా సిండికెట్ నిర్ణయాన్ని పట్టించుకోకుండా కిలో రూ.130 చొప్పున చికెన్ విక్రయించాడు. దీంతో ఆగ్రహించిన సహచర వ్యాపారులు భరత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భాస్కర్‌తో పాటు మరి కొందరు కలిసి అబ్దుల్లా దుకాణంలోకి దౌర్జన్యంగా ప్రవేశించారు. దుకాణాన్ని ధ్వంసం చేసి అబ్దుల్లాతో ఘర్షణకు దిగి మూకుమ్మడిగా దాడి చేశారు. దాడిలో అబ్దుల్లా గాయపడగా స్థానికులు అతన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అరటిపంట దగ్ధం



కాశినాయన : మండలంలోని ఆకులనారాయణ పల్లె గ్రామానికి చెందిన కాటాసుబ్బరాయుడు అనే రైతుకు చెందిన రెండు ఎకరాల్లోని అరటి పంట మంగళవారం కాలిపోయింది. రైతు తెలిపిన వివరాల మేరకు మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు ఒక దానికొకటి తగులుకుని మంటలు చెలరేగి రెండు ఎకరాల్లోని అరటిపంట, డ్రిప్ వైర్లు కాలిపోయాయని తెలిపారు. దాదాపు రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. వెంటనే పోరుమామిళ్ల ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

రుణాలు సక్రమంగా చెల్లించాలి

డీసీసీబీ సీఈఓ రాజేంద్రకుమార్



మాట్లాడుతున్న కడప డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్

రాయచోటి అర్బన్ : సహకార సంఘాల ద్వారా రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించకపోతే వారిపై వడ్డీభారం పడుతుందని కడప డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక డీసీసీబీ మెయిన్ బ్రాంచ్‌లో ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణా లను సకాలంలో చెల్లించాలన్నారు. లేనిపక్షంలో తీసుకున్న రుణంపై మొదటి ఏడాది 7 శాతం, 2, 3 సంవత్సరాలకు 13 శాతం వడ్డీని చెల్లించాల్సి ఉంటుందన్నారు. సకాలంలో రుణం చెల్లించిన రైతులకు రుణాల రీషెడ్యూలు చేయడం, వీలుంటే వారు తీసుకున్న రుణాన్ని మరింతగా పెంచి అందచేస్తామన్నారు. ఇదే సమయంలో కొత్తరైతులకు రుణాలు మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. రైతులు డబ్బులను ఎవరికైతే చెల్లిస్తారో వారి సంతకంతో కూడిన రశీదులు ఖచ్చితంగా తీసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాల బ్యాంకులో రూ. 427 కోట్లు డిపాజిట్లు ఉంటే రైతాంగానికి రూ.2,200 కోట్లు అప్పులుగా ఇచ్చామన్నారు. నాబార్డు, ఆప్కాబ్‌లనుండి అప్పులు తీసుకువచ్చి రైతులకు, చిన్నచిన్న వ్యాపారులకు, ఎస్ హెచ్‌జి గ్రూపులకు రుణాల రూపంలో అందచేశామన్నారు. జగనన్న తోడు, పాలవెల్లువ తదితర పథకాల అమలుకు బ్యాంకు ద్వారా తోడ్పాటునందిస్తున్నామన్నారు. సమావేశంలో డీసీసీ బ్యాంకు ఏజీఎం నారాయణరాజు, నోడల్ అధికారి శ్రీనివాసులు, బ్యాంకు మేనేజర్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి బ్యాంకు మంజూరు..

వీరబల్లి మండలానికి కడప డీసీసీ బ్యాంకు నూతన శాఖను మంజూరు చేసినందుకు డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్‌ను ఆ మండలంలోని సహకార సంఘాల అధికారులు, సీఈఓలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఈఓలు జాఫర్, రెడ్డిబాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులు

గాలివీడు : జిల్లా వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులు పనిచేస్తున్నాయని, ఇది శుభపరిణామమని ది కడప డిస్ట్రిక్ కో–ఆపరేటీవ్ సెంట్రల్ బ్యాంక్ సీఈఓ రాజేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం డీసీసీ బ్యాంక్ గాలివీడు శాఖ కార్యాలయాన్ని సందర్శించిన అనంతరం సహకార బ్యాంకులో పాలకవర్గ సభ్యులు, బ్యాంకు అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ డీసీసీబీ సేవలను స్థానికులు, ఎస్ హెచ్‌జీ సంఘాలు వినియోగించుకోవాలన్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులు డీసీసీబీ బ్యాంకులో ఖాతాలు ప్రారంభించి రుణాలు పొందినట్‌లైతే సత్వర సేవలు అందజేస్తామన్నారు. గతంలో సహకార బ్యాంకులు అప్పుల ఊబిలో ఉండేవని, వాటిని లాభాల బాటలో నడిపించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, తద్వారా మెరుగైన అధిక ఆర్థిక లావాదేవీలతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉందన్నారు. కార్యక్రమంలో డీజీఎం నారాయణ రాజు, బ్రాంచ్ మేనేజర్ నారాయణ రెడ్డి, సూపర్ వైజర్ శివప్రసాద్, గాలివీడు, నూలివీడు ఏపీసీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు వెండి కిరీటాలు సమర్పణ



డిప్యూటీ ఈవోకు వెండి కిరీటాలను అందజేస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన శ్రీ సీతారామలక్ష్మణ మూర్తులకు మంగళవారం మూడు వెండి కిరీటాలను సమర్పించారని ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరు మండలం, రాఘవ రాజపురం గ్రామానికి చెందిన రామిరెడ్డి సూర్యచంద్రారెడ్డి, సుగుణ దంపతులు ఈ వెండి కిరీటాలను బహుకరించారని, వీటి బరువు రెండు కిలోలు, విలువ సూమారు రెండు లక్షల వరకు ఉంటుందని చెప్పారు. ఈ కిరీటాలకు ఆలయ రంగమండపంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, రామయ్య సన్నిధిలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబుకు వారు అందజేశారు.

కుల ధ్రువీకరణపత్రంపై విచారణ

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న అరుణకుమారి ఎస్సీ కులధ్రువీకరణ పత్రంతో 2007లో అంగన్ వాడీ కార్యకర్తగా ఉద్యోగం పొందిందని ఓ వ్యక్తి లోకాయుక్తలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మంగళవారం లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ కార్యాలయంలో ఆర్డీఓ రంగస్వామి, ఇన్‌చార్జ్ ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మీ, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ విచారణ చేపట్టారు. అరుణకుమారి కులధ్రువీకరణ పత్రంలో బీసీ–బీ (ఈడిగ) కులానికి చెందిందని, 2007లో లక్కిరెడ్డిపల్లి మండలం, మద్దిరేవుల గ్రామం, ఈడిగపల్లెలో అంగన్ వాడీ కార్యకర్తగా విధులలో చేరిందన్నారు. వారి రికార్డులలో మాత్రం బీసీ కులానికి చెందినట్లు ఉందని అధికారులు తెలిపారు. ఆమె కులధ్రువీకరణ పత్రంలో ఎలాంటి అక్రమాలు లేవని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహశీల్దార్ నరసింహులు, సీడీపీఓ పద్మావతి, ఎస్ఐ వినోద్ కుమార్, ఆర్ఐ సమ్మత్ ఖాన్, ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ వీఆర్ఏపై క్రిమినల్ కేసు నమోదుకు సిఫార్సు

గాలివీడు : నకిలీ వీఆర్ఏ కోలా రమణపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు తహశీల్దార్ దైవాదీనం తెలిపారు. మండలంలోని గోరాన్ చెరువు, గాలివీడు గ్రామాల పరిధిలో భూపట్టాలు ఇస్తానని నమ్మబలికి అక్రమ వసూళ్లకు పాల్పడిన అవినీతి నకిలీ వీఆర్ఏపై మంగళవారం తహశీల్దార్ సమక్షంలో బాధితుల ఫిర్యాదుతో నివేదికలు తయారు చేసి జిల్లా అధికారులకు పంపినట్లు ఆయన స్పష్టం చేశారు. ఇది ఇలా ఉండగా సోమవారం స్పందన కార్యక్రమంలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కలెక్టర్ గాలివీడు రెవెన్యూ సిబ్బందిని మందలించి, రెండు రోజులలో బాధితుల సొమ్మును చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలను అమలులో అలసత్వం వహిస్తున్న రెవెన్యూ అధికారుల తీరుపై బాధితులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నకిలీ వీఆర్ఏ నుండి తమకు రావాల్సిన సొమ్మును చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

అత్తింటివారు హత్యచేశారని తల్లి ఫిర్యాదు




భర్తతో కలిసి ఉన్న ఛాయ (ఫైల్), ఛాయ మృతదేహం

మదనపల్లె : అనుమానాస్పద స్థితిలో ప్రైవేట్‌స్కూల్ ఉపాధ్యాయిని మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. అయితే అత్తింటివారే తమ బిడ్డను హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని, తమకు న్యాయం చేయాలని మృతురాలి తల్లి మంజుల తాలూకా పోలీసులకు ఫిర్యాదుచేసింది. మృతురాలి బంధువులు, తాలూకా పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని కొత్తపల్లె పంచాయతీ భవానీనగర్‌కు చెందిన నాగేంద్రకు 14 ఏళ్ల కిందట బెంగళూరుకు చెందిన ఛాయా(32)తో వివాహమైంది. నాగేంద్ర టైల్స్ వ్యాపారం చేస్తుండగా, ఛాయా స్థానికంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. వీరికి ఒక కుమారుడు సాయినీలేష్(11) ఉన్నాడు. సోమవారం కుమారుడి జన్మదిన వేడుకలను ఇంట్లో ఆనందంగా జరుపుకున్నారు. అయితే ఆ తర్వాత ఛాయ రాత్రి 10గంటల సమయంలో పడకగదిలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన భర్త కుటుంబసభ్యులు వెంటనే బాధితురాలిని పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో ప్రైవేట్ అంబులెన్స్‌లో బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఛాయ మృతి చెందింది. కుటుంబసభ్యులు మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించకుండా నేరుగా ఇంటికి తీసుకువెళ్లారు. తమ కుమార్తె మృతి చెందిందన్న సమాచారాన్ని తెలుసుకున్న ఛాయ తల్లి మంజుల, సోదరి మంగళవారం మదనపల్లెకు చేరుకున్నారు. అత్తింటివారు తమబిడ్డను హత్యచేశారని ఆరోపిస్తూ నాగేంద్ర, అతని కుటుంబసభ్యులతో గొడవకు దిగారు. దీంతో భవానీనగర్‌లో ఉద్రిక్తత ఏర్పడింది. తాలూకా ఎస్ఐ చంద్రశేఖర్ భవానీనగర్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ఘటనపై ఆరా తీశారు. బాధితులకు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. నాగేంద్ర, ఛాయ దంపతుల మధ్య కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయని మృతురాలి బంధువులు చెప్పారు. నాగేంద్ర కొద్దిరోజులుగా ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో గొడవల నేపథ్యంలో నాగేంద్ర, ఇతని తమ్ముడు, మరి కొందరితో కలిసి ఛాయను హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని బాధితురాలి తల్లి మంజుల ఆరోపించింది. ఈ నేపథ్యంలో పోలీసులు నాగేంద్రను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి సైన్సు ఫెయిర్‌లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న జస్మిత

కడప ఎడ్యుకేషన్ : విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్సు ఫెయిర్ లో ఏకో ఫ్రెండ్లీ మెటీరియల్స్ విభాగంలో సింహాద్రిపురం మండలం బలపనూరు జిల్లా పరిషత్తు పాఠశాలలో ఎనిమిదవ తగరతి చదువుతున్న జి.హరిజష్మిత అనే విద్యార్థి మూడో బహుమతిని సాధించినట్లు జిల్లా సైన్సు అధికారి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. జాయింట్ కలెక్టర్ నూపూర్ అజయ్, విజయవాడ మేయర్ రాయ న రాజ్యలక్ష్మి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డిల చేతుల మీదుగా బహుమతిని అందుకుంది.

పూర్తి వివరాలు ఇలా..

ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్స్ విభాగం:

- ప్రథమ–ఎస్.సుమ,(జెడ్పీహెచ్ఎస్, కొంతమూరు, తూర్పు గోదావరి),
- ద్వితీయ–వై.భావన, జెడ్పీహెచ్ఎస్ బిట్రగుంట, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
- తృతీయ– జి.హరిజష్మిత, జెడ్పీహెచ్ఎస్, బలపనూరు, వైయస్సార్ కడప

హెల్త్ అండ్ క్లీన్ నెస్ విభాగం:

- ప్రథమ–కె.పూజితశ్రీ, జెడ్పీహెచ్ఎస్, మేదరమెట్ల, ప్రకాశం
- ద్వితీయ–జి.భానుప్రియ, ఎం.పి.యూ.పి.ఎస్, కైరేరు, అనంతపురం
- తృతీయ– ఎస్.లక్ష్మీనరసింహ, జెడ్పీహెచ్ఎస్, నాగసముద్రం, శ్రీ సత్యసాయి జిల్లా

సాఫ్ట్వేర్ అండ్ యాప్స్ విభాగం:

- ప్రథమ– ఎస్.ఆకాశ్, పీసీఆర్ గవర్నమెంట్ హైస్కూల్, చిత్తూరు
- ద్వితీయ–మహేష్ కుమార్, ఏపీ మోడల్ స్కూల్, జట్టిపాళెం, పల్నాడు
- తృతీయ– కె.వినూత్న, డా. బీఆర్ అంబేద్కర్ గురుకులం, గోపాలపురం, పశ్చిమ గోదావరి

ఎన్విరానిమెంటల్ అండ్ క్లైమేట్ చేంజస్ విభాగం

- ప్రథమ–వి.యశస్విని, జెడ్పీహెచ్ఎస్, ధర్మవరం, విజయనగరం
- ద్వితీయ–సీహెచ్ లీలసత్య శ్రీనాథ్, జెడ్పీహెచ్ఎస్, మట్లపాలెం, పశ్చిమగోదావరి
- తృతీయ–ఎం.శశాంక్, సీఎస్ఆర్ జెడ్పీహెచ్ఎస్, అమ్మనబ్రోలు, ప్రకాశం

మేథమెటికల్ మోడలింగ్ విభాగం:

- ప్రథమ– వి.చరణ్ శ్రీ, ఏఎస్ జెడ్పీహెచ్ఎస్, అన్నదేవరపేట, తూర్పుగోదావరి
- ద్వితీయ–జి.గణేశ్, జెడ్పీహెచ్ఎస్, లింగరాజపాలెం, అనకాపల్లి
- తృతీయ–పి.షహీన్ బి, జెడ్పీహెచ్ఎస్, పెంచికలపాడు, కర్నూలు

సాటుసారా ఊట స్వాధీనం

వేంపల్లె : మండలంలోని ముతుకూరు గ్రామ సమీపంలో మొగమూరు వంకలో 200లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. మంగళవారం సీఐ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు పోలీసు సిబ్బందితో కలిసి నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో నాటుసారా ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా నాటుసారా తయారీ చేసినా, విక్రయించినా వదిలే ప్రసక్తే లేదన్నారు. చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ కానిస్టేబుల్ రమణారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హత్యరాల మడుగులో దూకి ఉపాధ్యాయుడు ఆత్మహత్య



వెంకటేశ్వర్లు (ఫైల్)

రాజంపేట : చెయ్యేరు నదీ సమీపంలో ఉన్న హత్యరాల మడుగులో ఎన్‌టీఆర్ నగర్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న సామా వెంకటేశ్వర్లు (45)దూకి ఆత్మహత్య చేసుకున్నారు. సోమవారం నుంచి ఈ ఉపాధ్యాయుడు కనిపించకుండాపోయారు. మంగళవారం మడుగులో శవమై తేలాడు. మడుగు సమీపంలో మృతుని స్కూటీ, దుస్తులు లభ్యమయ్యాయి. ఆధార్ కార్డు ద్వారా గుర్తించారు. మృతుని వద్ద సూసైడ్ నోట్ ఉంది. ఈ నోట్‌లో ఆర్థిక పరిస్థితులు, ఆరోగ్య, మానసిక స్థితి సరిగ్గాలేవన్న కారణంతో ఆత్మహత్య చేసుకున్నట్లుగా అందులో రాశారు. తన ఆత్మహత్యకు ఎవరు కారణం కాదన్నారు. తనది పుల్లంపేటలో కాపువీధి అని, తన మృతి విషయం బావమరిది సురేష్‌కు తెలపాలనే విధంగా ఫోన్ నెంబరులను తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. విధి నిర్వహణలో భాగంగా పట్టణంలోనే నివాసం ఉంటున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రాజంపేట రూరల్ ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. మృతుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు వెల్లడించారు.

మండేకాలం

- ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం
- ప్రమాదాలకు కారణంగా నిలుస్తున్న ఎల్‌పీజీ సిలిండర్లు, షార్ట్ సర్క్యూట్‌లు
- జిల్లాలో గతేడాది 240 అగ్ని ప్రమాదాలు. రూ. 2.60 కోట్ల మేర ఆస్తినష్టం
- అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా అందుబాటులో ఎనిమిది అగ్నిమాపక కేంద్రాలు
- ప్రమాదం ఏదైనా 101కు సమాచారం అందిస్తే తక్షణమే సహాయక చర్యలు
- వేసవిలో మరింత అప్రమత్తత అవసరమంటున్న అధికారులు



పొలంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సాక్షి, రాయచోటి : ఎండలు మండుతున్నాయి....మండే ఎండలకు తోడు అగ్ని రాజుకుందంటే ఆర్పడం కష్టమే. అందుకే ప్రతి ఒక్కరూ తస్మాత్ జాగ్రత్తగా ఉండాలి. అందులోనూ ఎక్కువ ప్రమాదాలు జరిగే సమయం కూడా వేసవే కావడంతో ఎంతైనా అప్రమత్తత అవసరం. బోదకొట్టమైనా...గడ్డి వాము అయినా....కొండ ప్రాంతమైనా....సిలిండర్ అయినా అగ్గి రాజుకుందంటే ప్రస్తుత పరిస్థితుల్లో నానా తిప్పలు తప్పవు. ఎంతోకొంత జాగ్రత్తలు పాటిస్తూ....కొంతమేర అప్రమత్తంగా ఉన్నా నివారించడానికి సులువుగా ఉంటుంది. ప్రమాదాల నేపథ్యంలో అగ్నిమాపకశాఖ ప్రత్యేకంగా 101 నెంబరును అందుబాటులో ఉంచింది. అన్నమయ్య జిల్లాలో ప్రత్యేకంగా ఎనిమిది అగ్నిమాపక వాహనాలు ఉండగా, ప్రమాదం తలెత్తిన సమయంలో నీటి సమస్య ఉత్పన్నం కాకుండా అధికారులు ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకున్నారు.

పొంచి చూస్తున్న ప్రమాదం

జిల్లాలో వేసవి నేపథ్యంలో ప్రమాదాలు కూడా పొంచి చూస్తున్నాయి. చిన్నపాటి అగ్గిరవ్వ పడినా కొండ మొత్తం కాలిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రధానంగా వంటింట్లో గ్యాస్ సిలిండర్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపకశాఖ తెలియజేస్తోంది. ఎల్‌పీజీ సిలిండర్‌ను గాలి, వెలుతురు ఉన్న ప్రాంతంలో పెట్టుకోవడంతోపాటు పనిముగియగానే రెగ్యులేటర్ వాల్వ్ ఆఫ్ చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

- 2019 ఏప్రిల్ నుంచి 2020 మార్చి 31వ తేది వరకు సుమారు 417 ప్రమాదాలు జరగ్గా, ఈ ప్రమాదంలో రూ. 27.99 కోట్ల ఆస్తులు చిక్కుకుపోగా, రూ. 10.73 కోట్ల ఆస్తులు అగ్నికి ఆహుతి అయింది. రూ. 17.26 కోట్ల ఆస్తులను కాపాడగలిగారు. అలాగే 2020 నుంచి 2021 మార్చి వరకు 487 ప్రమాదాలు జరగ్గా, అందులో రూ. 23.58 కోట్ల ఆస్తులు అగ్ని కోరల్లో చిక్కుకోగా, అందులో రూ. 10.25 కోట్లు ఆస్తులను కోల్పోగా, రూ. 13.32 కోట్ల ఆస్తులను కాపాడగలిగారు. అలాగే 2021–22 ఏడాదికి సంబంధించి ఇప్పటివరకు 398 ప్రమాదాలు జరగ్గా, రూ. 26.74 కోట్ల ఆస్తులు అగ్నిలో చిక్కుకున్నాయి. అందులో రూ. 24.06 కోట్లు అగ్నికి ఆహుతి కాగా, రూ. 2.43 కోట్ల ఆస్తులను సంరక్షించగలిగారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 ఫిబ్రవరి వరకు అగ్ని ప్రమాదాలకు సంబంధించి (చిన్న, పెద్ద, రెస్క్యూ కలుపుకుని) 240 ఫోన్ కాల్స్ వచ్చాయి. ప్రమాదాల పరంగా జిల్లాలో రూ. 2.60 కోట్ల మేర ఆస్తులు అగ్నికి ఆహుతి కాగా, రూ. 7.68 కోట్ల మేర ప్రజల ఆస్తులను అగ్నిమాపకశాఖ కాపాడగలిగింది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో అగ్ని ప్రమాదాల పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తగా ఉండాలని అధికారులు పేర్కొంటున్నారు.

అగ్ని ప్రమాదం జరిగిందా... అయితే కాల్ 101

అగ్ని ప్రమాదం సంభవించినట్లయితే వెంటనే 101కు కాల్‌కు చేయగానే అధికారులు అందుబాటులోకి వస్తారు. అగ్నిమాపకశాఖ ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబరుగా 101ను వినియోగిస్తోంది. ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరిగినా 101కుగానీ, లేదంటే ఇతర ఫైర్ స్టేషన్ అధికారులకు కాల్ చేయవచ్చు.

జాగ్రత్తలు పాటించండి

- గడ్డివాముల నిర్మాణ విషయంలో ఇంటికి 60 అడుగుల దూరంలో ఉండేలా చూసుకోవాలి.
- వంట గదిలో కిరోసిన్, పెట్రోలు, డీజల్, అదనపు గ్యాస్ సిలిండర్లు ఉంచవద్దు.
- అగ్గిపెట్టెలు, కిరోసిన్ వంటి నిల్వలను పొయ్యికి దూరంగా ఉంచాలి.
- చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాసులు, ఇతర మండే పదార్థాలు అందుబాటులో ఉంచవద్దు.
- కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గి పుల్లలు ఆర్పకుండా పారవేయవద్దు.
- ఇంటిలో బెడ్డుమీద పడుకొని పొగతాగరాదు.
- ఇంటినుంచి ఎక్కడికైనా సెలవుల్లో గడిపేందుకు వెళుతున్న తరుణంలో ఇంటికి సంబంధించిన విద్యుత్ మెయిన్‌ను ఆఫ్ చేసి వెళ్లాలి.
- ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్, గోడౌన్లు, అపార్టుమెంటులలో ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే నేరుగా ఆర్పడానికి అవసరమైన నీటిని మరియు ఫిక్స్‌డ్ ఫైర్ ఫైటింగ్, ఎక్స్‌ట్వింగిషర్స్‌ను నిబంధనల మేరకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలి.

ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మండే ఎండకు తోడు అగ్ని ప్రమాదాలు జరిగితే మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడతాయి. సాధ్యమైనంత వరకు ప్రజలు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు కొంత మేర జాగ్రత్తలు తీసుకుంటే నివారించవచ్చు. అప్పటికీ కూడా ప్రమాదాలు జరిగినా అగ్నిమాపకశాఖ యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది. ప్రమాదం జరిగిన మరుక్షణమే ఆస్తులను కాపాడే బాధ్యత అగ్నిమాపకశాఖ తీసుకుంటుంది.

– పి.అనిల్‌కుమార్, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

జిల్లాలోని అగ్నిమాపకశాఖ కేంద్రాలు, అధికారుల ఫోన్ నెంబర్లు

అగ్నిమాపక కేంద్రం	అధికారి పేరు	సెల్ నెంబరు	కార్యాలయ నెంబరు
రైల్వేకోడూరు	కె.విజయ్‌కుమార్	9963879126	08566-244099
లక్కిరెడ్డిపల్లె	జేసీ బాల హుసేనయ్య	9963737731	08567-234199
రాజంపేట	ఎస్.శివశంకర్	9963479554	08565-240299
రాయచోటి	ఎం.వెంకట్రామిరెడ్డి	9963737253	08561-251099
పీలేరు	డి.సుబ్బరాజు	9963736587	08584-244399
మదనపల్లె	కె.మాబుసుబాన్	9963738597	08571-222101
వాల్మీకిపురం	డి.సుబ్బరాజు	9963737042	08586-271199
మొలకలచెరువు	కె.మాబుసుబాన్	9963736976	08582-294455

సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 1 । మార్చి । 2023



రుణాలు సక్రమంగా చెల్లించాలి

సహకార సంఘాల ద్వారా రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించకపోతే వారిపై వడ్డీభారం పడుతుందని కడప డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్ అన్నారు. - 8లో



వివాహిత అనుమానాస్పద మృతి

అనుమానాస్పద స్థితిలో ప్రైవేట్‌స్కూల్ ఉపాధ్యాయిని మృతి చెందిన సంఘటన మదనపల్లె పట్టణంలో జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.250
రెండోరకం	రూ.100	రూ.176

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 269 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	607	615
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 209.26 కిలోలు

దినేష్.. ఆరో తరగతి చదువుతున్నాడు. రోజులాగే భుజానికి బ్యాగు తగిలించుకుని బడికి వెళ్లాడు. సాయంత్రం బడి వదలగానే తిరిగి ఇంటికి బయలుదేరాడు. మరో రెండు నిమిషాల్లో ఇంటికి చేరుకుంటాడనే లోపే వీధి చివర్లో ఉన్న ఓ కుక్క ఉన్నఫళంగా భౌమంటూ మీదికి దుమికింది. కుక్క నుంచి తప్పించుకునేందుకు భయంతో పరుగులు తీసిన బాలుడు అదుపుతప్పి కిందపడటంతో తలకు, మోకాలికి, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి తోడు కుక్క కూడా దాడి చేసి తీవ్రంగా కొరకడంతో రక్త గాయాలతో ఆసుపత్రి పాలై అతి కష్టం మీద బతికి బయటపడ్డాడు.

వెంకటేష్. ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తాడు. రోజూ సాయంత్రం డ్యూటీకి వెళితే ఏ అర్ధరాత్రో డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లాలి. రోజులాగే ఓ రోజు రాత్రి డ్యూటీ నుంచి తన బైకులో ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఓ చోట కుక్కల గుంపు ఒక్కసారిగా తన బైకును వెంబడించాయి. భయంతో బైకును వేగంగా నడిపి స్పీడ్ బ్రేకర్ల వద్ద అదుపు తప్పి కింద పడటంతో కాలు విరిగి శస్త్ర చికిత్స చేయించుకుని దాదాపు రెండు నెలల పాటు మంచానికే పరిమితమయ్యాడు.

నారాయణ ఓ సగటు ఉద్యోగి. ఓ రోజు ఉదయమే తన బైకులో కూరగాయలు తీసుకొచ్చేందుకు మార్కెట్‌కు బయలుదేరాడు. రోడ్డుపైన తన దారిన తాను వెళుతున్నాడు. ఇంతలో డివైడర్ అటువైపున రెండు కుక్కలు పోట్లాడుకుని వేగంగా వచ్చి నారాయణ బైకును ఢీకొనడంతో ఒక్కసారిగా కింద పడి తలకు తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లిపోయాడు.

అధికారులు ఏం చేయాలంటే..

పాదచారులను, ద్విచక్రవాహనదారులను కాటేస్తున్న, వారు ప్రమాదాల బారిన పడేలా చేస్తున్న కుక్కల విషయంలో అధికారులు తీవ్రంగా స్పందించాలి.

- కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల పేరుతో డబ్బులు ఖర్చు చేసినా వాటిని తిరిగి యథాస్థానంలో వదులుతుండటంతో అవి మనుషులపై యధావిధిగా దాడులకు దిగుతున్నాయి.
- అందువల్ల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కంటే వాటిని పట్టుకుని వెళ్లడమే సరైన నిర్ణయమని పలువురు సూచిస్తున్నారు.
- ప్రధానంగా రాత్రి వేళల్లోనే కుక్కల సమస్య తీవ్రంగా ఉండటంతో కుక్కలను పట్టే వారిని తీసుకొచ్చి రాత్రి వేళల్లోనే కుక్కలను పట్టే కార్యక్రమం చేపట్టాలి.
- వాటిని తీసుకెళ్లి అవి తిరిగి జనారణ్యంలోకి వచ్చేందుకు వీలు లేని విధంగా ఉన్న అడవుల్లో వదిలేయాలి.

శునకాలు పట్టేస్తున్నా.. కు.ని.కి పాటేనా!

హైదరాబాదు నగరంలో ఇటీవల ఓ పసి బాలుడిపై పట్టపగలు కుక్కలు దాడిచేసి దారుణంగా చంపేసిన హృదయ విదారక సంఘటన మనందరి కళ్లముందు ఇంకా కదలాడుతూనే ఉంది. కుక్కల నియంత్రణ విషయంలో అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో అలాంటి సంఘటనలు మన జిల్లాలోనూ చోటుచేసుకునే ప్రమాదం లేకపోలేదని తల్లిదండ్రులు భయంతో వణికిపోతున్నారు. కుక్కలను నియంత్రించాల్సిన బాధ్యత కలిగిన అధికారులు మాత్రం కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయిస్తున్నామంటూ మాటలతో గడిపేస్తున్నారు.

- భయపెడుతున్న వీధి కుక్కలు
- పాదచారులు, ద్విచక్రవాహనదారులపై దాడులకు తెగబడుతున్న వైనం
- ఆసుపత్రుల పాలవుతున్న బాధితులు
- పట్టించుకోని స్థానిక సంస్థల అధికారులు



ములకలచెరువు: బురకాయలకోటలో రోడ్డుపై వీధికుక్కలు

(ఇన్‌సెట్) గుర్రంకొండలో కుక్కల దాడిలో బాలుడి కాలికి తీవ్ర గాయమైన దృశ్యం (ఫైల్)



గుర్రంకొండ: కుక్కల దాడిలో గాయపడిన బాలుడు (ఫైల్)

సాక్షి, నెట్‌వర్క్: అన్నమయ్య జిల్లాలో కుక్కల బెడద తీవ్రమైంది.కుక్కలను నియంత్రించాల్సిన అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. గతంలో మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కుక్కలు పట్టేవారిని తీసుకొచ్చి కుక్కలను పట్టించేవారు. వాటిని తీసుకెళ్లి ఇంజక్షన్ ఇచ్చి చంపేసేవారు. ఆ తర్వాత వాటిని చంపడం మానేసి దూరంగా ఉన్న అడవుల్లో వదిలేసేవారు. కానీ గత కొద్ది సంవత్సరాలుగా కుక్కలను పట్టుకుని వెళ్లడం అనే విషయాన్ని స్థానిక సంస్థల అధికారులు పూర్తిగా మరిచిపోయారు. ఫలితంగా ప్రతి చోటా కుక్కలు వందల సంఖ్యలో గుంపులు, గుంపులుగా ఉంటున్నాయి. ఇటీవలి కాలంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ పేరుతో చేపట్టిన కార్యక్రమం కూడా ప్రహసనంగానే ముగిసింది. కుటుంబ నియంత్రణ సంగతి ఏమోగానీ కుక్కల సంతతి మాత్రం పెరిగిపోతూ ఉంది.

- మదనపల్లె మున్సిపాలిటీలోని 35 వార్డుల్లో సుమారుగా 5500 వరకు వీధి కుక్కలు ఉన్నట్లు అధికారుల అంచనా. అయితే అధికారికంగా సర్వే నిర్వహించలేదు. నాలుగేళ్ల క్రితం వీధి కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్ నిర్వహించారు. తర్వాత ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ విషయమై మున్సిపాలిటీ డీఈ బండపల్లి శిరీష మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్ చేసేందుకు టెండర్లు పిలిచామన్నారు.
- బి.కొత్తకోట నగర పంచాయతీలో కుక్కల బెడద అధికంగా ఉంది. సుమారు 400 పైగా కుక్కలు ఉన్నాయి. వీటిపై నగర పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వాటికి వ్యాక్సినేషన్ చేయిస్తామని చెబుతున్నారు.
- రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో గత ఏడాది డిసెంబర్ నెలలో సుమారు 900 వీధి కుక్కలను పట్టుకుని బయట వదిలారు. ఇంకా వేల కుక్కలు రాయచోటి పట్టణ పరిధిలో సంచరిస్తున్నాయి.

15 మందికి కుక్క కాటు

చిన్నమండెం మండల వ్యాప్తంగా ఇటీవల 15 మంది కుక్కకాటుకు గురైనట్లు వైద్యాధికారులు తెలిపారు.

రాజంపేటలో..

రాజంపేట పట్టణంలో 300 వరకు వీధి కుక్కలు ఉన్నాయి. వీధికి 10 నుంచి 15 కుక్కలు ఉన్నాయని మున్సిపాలిటీ వర్గాల అంచనా. ఆరునెలల క్రితం 200 వరకు కుక్కలను పట్టుకొని అటవీ ప్రాంతంలో వదలివేశారు. అయినప్పటికీ వీటి సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. ఈ ఏడాది జనవరిలో పట్టణంలో 292 మంది కుక్క కాటుకు గురికాగా, అందులో కేవలం ఈ నెలలోనే 137 మంది కుక్క కాటుకు గురయ్యారు. నియోజకవర్గంలోని నందలూరు, వీరబల్లి, సుండుపల్లె, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల్లో వీధి కుక్కల సంచారం అధికంగానే ఉంది. నెలలో ఐదు నుంచి ఆరుగురికి కుక్క కాటుకు టీకాలు వేస్తున్నామని వీరబల్లి, సుండుపల్లె పీహెచ్‌సీ అధికారులు తెలిపారు.

ఆసుపత్రులకు క్యూ కడుతున్న బాధితులు..

ములకలచెరువు: ములకలచెరువు మండలంలో రోజుకు ఇద్దరు లేదా ముగ్గురు కుక్క కాటుకు గురవుతున్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి రికార్డులు తెలుపుతున్నాయి. గత రెండు రోజులుగా మండలంలోని పర్తికోట నుంచి ఒకరు, దేవులచెరువు నుంచి ఒకరు, స్థానిక వినాయకనగర్‌కు చెందిన ఒకరు, స్థానిక కదిరి రోడ్డు నుంచి ఇద్దరు మొత్తం ముగ్గురు చిన్నారులు, ఇద్దరు వృద్ధులు ఆసుపత్రిలో చికిత్స పొందారు.

కోళ్ల వ్యర్థాలు మరిగి..

గుర్రంకొండ: పట్టణంలో 18 చికెన్ దుకాణాలను నిర్వహిస్తున్నారు. చికెన్ అమ్మకాల్లో భాగంగా కోళ్లలోని వ్యర్థాలను కడప–బెంగళూరు జాతీయ రహదారి, గుర్రంకొండ– గాలివీడు, గుర్రంకొండ– కలకడ మార్గాలలోని రోడ్లపక్కనే పడేస్తున్నారు. గ్రామంలోని వందలాది కుక్కలు ఈ వ్యర్థాలను తినేందుకు అలవాటు పడ్డాయి. ఆహారం తక్కువైనప్పుడు అటువైపు వెళ్లే పాదచారులు, ద్విచక్రవాహనదారులపై దాడికి దిగుతున్నాయి. పలువురు గాయపడి ఆస్పత్రుల పాలయ్యారు. గతంలో కుక్కల దాడిలో ఓ బాలుడు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి.

రాత్రుల్లే కాదు.. పగటి పూట సైతం ..

రామసముద్రం: రామసముద్రం, చెంబకూరు తదితర పంచాయతీలోనే కాకుండా చెంబకూరు–రామసముద్రం, రామసముద్రం -పుంగనూరు, రామసముద్రం - ముళబాగిల్ , శ్రీనివాసపురం ప్రధాన రోడ్డు మార్గాలు, మారుమూల గ్రామాల్లో సైతం వీధి కుక్కలకు జనంపై దాడి చేస్తున్నాయి. రాత్రి వేళల్లోనే కాకుండా పగటిపూట కూడా ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామానికి వెళ్లాలంటే జనం భయపడుతున్నారు. ద్విచక్ర, నాలుగుచక్రాల వాహనాలను సైతం వెంటపడుతున్నాయి. కుక్కలు యథేచ్ఛగా తిరగడమే కాకుండా మనుషులపై తిరగబడుతున్నాయి. పిల్లలను ఒంటరిగా బయటకు పంపాలంటే భయపడుతున్నారు.

ఓబులవారిపల్లె: గత రెండు నెలలుగా రైల్వేకోడూరులో 190 మంది, ఓబులవారిపల్లెలో 53 మంది, చిట్వేలిలో 97, పెనగలూరులో 60, పుల్లంపేటలో 52 మంది కుక్క కాటుకు గురయ్యారు.

ఒకే కుక్క 15 మందిని కరిచింది



మా వీధిలో ఒకే కుక్క 15 మందిని కరిచింది. ఒంటరిగా వెళ్లాలంటే భయమేస్తోంది. చిన్న పిల్లలు స్కూలుకు, ట్యూషన్‌కు వెళ్లాలంటే భయపడుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాం. ఫలితం లేదు. దొరికితే మేమే చంపేయాలనుకుంటున్నాం . -కవిత, బేతల్ కాలనీ, రాయచోటి

కుక్కలు పట్టే వారిని పిలిపిస్తాం



కుక్కలు పట్టే వారిని తీసుకొచ్చి కుక్కలను పట్టుకుని అడవుల్లో వదిలేస్తున్నాం. ఇంతవరకు 800 కుక్కలను పట్టుకున్నాం. ఇంకా మిగిలిన కుక్కలను కూడా పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటాం.

–రాంబాబు, మున్సిపల్ కమిషనర్, రాయచోటి

న్యూస్‌రీల్

నిర్దేశించిన లక్ష్యాన్ని వందశాతం సాధించాలి

రాయచోటి అర్బన్: వైద్యాధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయడం ద్వారా నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం సాధించాలని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.కొండయ్య పిలుపునిచ్చారు. మంగళవారం డీఎంఅండ్‌హెచ్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పర్యవేక్షక అధికారులు, సిబ్బందితో ఆయన నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వైద్యులు, వైద్యసిబ్బంది నిబద్ధతతో పనిచేసి ప్రజల మన్ననలు పొందడంతో పాటు జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్నిరకాల ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఆరోగ్య కార్యక్రమాల అమలులో ప్రాథమిక కేంద్రాల వారీగా సాధించిన ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. వివిధ ఆరోగ్య పథకాలు, కార్యక్రమాల గురించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శైలజ, డీఐఓ ఉషశ్రీ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మధుసూదన్‌రెడ్డి, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ శేష గిరిబాబు, డిస్ట్రిక్ట్ సర్వేలెన్స్ అధికారి రియాజ్‌బేగ్, స్టాటిస్టికల్ ఆఫీసర్ ఓబులరెడ్డితో పాటు జిల్లాలో పీహెచ్‌సిల నుంచి విచ్చేసిన నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 11న ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్ల పంపిణీ

కడప సిటీ: కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల బ్యాలెట్ పేపర్ల పంపిణీని మార్చి 11వ తేదీన చేపడతామని అనంతపురం జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పుట్టపర్తి, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన డీఆర్వోలు, నోడల్ ఆఫీసర్లతో ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పుట్టపర్తి, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలకు అనంతపురం కలెక్టరేట్ నుంచి మార్చి 11న ఉదయం 9.00 గంటలకు బ్యాలెట్ పేపర్లను పంపిణీ చేస్తామన్నారు. బ్యాలెట్ పేపర్లను బందోబస్తుతో తీసుకు వెళ్లాలని సూచించారు. ఆ తర్వాత బ్యాలెట్ పేపర్లను ఆయా జిల్లాల పోలింగ్ కేంద్రాలకు అందజేయాలన్నారు. బహిరంగసభలు, ర్యాలీలు, వాహనాల అనుమతి కోసం జిల్లా కేంద్రంలో సింగిల్ విండో సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సంబంధిత జిల్లా ఎన్నికల అధికారి అనుమతులు మంజూరు చేయాల్సి ఉంటుందన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

- సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ



రాయచోటి అర్బన్ : దేశంలోని నిర్మాణాలు, ప్రదేశాల పేర్లను మార్చాలంటూ బీజేపీ నేత అశ్వనీ కుమార్ ఉపాధ్యాయ వేసిన పిటిషన్‌ను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ అన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ నేతలు కోర్టుల్లో పిటిషన్‌లు వేయడం, ప్రజల మధ్య చిలీకలు తెస్తుండటం అన్యాయం అన్నారు. మతాల మధ్య చిచ్చు పెట్టడం, ప్రజల మధ్య అంతరాలు సృష్టించడం బ్రిటీషు వారి విధానం అన్నారు. దానిని బీజేపీ మళ్లీ అమలు చేయాలనుకోవడం దారుణమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పిటిషన్‌లు వేయవద్దని, కోర్టు సమయం వృథా చేయవద్దంటూ పిటిషనర్‌కు 'సుప్రీం' సూచించడం అభినందనీయమన్నారు. మతోన్మాద శక్తులకు ఇది చెంపపెట్టు లాంటిదన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు విశ్వనాథనాయక్, సిద్దిగాళ్ల శ్రీనివాసులు, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఎన్నికల కోలాహలం

- తలపడుతున్న మజ్దూర్, ఎంప్లాయీస్ సంఘ్
- తొలివిడతలో 5న నందలూరులో పోలింగ్
- గుర్తులు కేటాయించిన రైల్వే పర్సనల్ అధికారులు

నందలూరు(రాజంపేట): సౌత్‌సెంట్రల్ రైల్వే పరిధి గుంతకల్ డివిజన్‌లో రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఎన్నికల కోలాహలం నెలకొంది. డివిజన్‌లో ఎనిమిది రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గాలకు ఈనెల 15వతేదీలోపు ఎన్నికలు పూర్తి చేయాలని సౌత్‌సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్(పీసీపీఓ) గుంతకల్ రైల్వేడివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ (డీపీఓ) చౌహాన్‌కు ఆదేశాలు జారీ చేశారు. గుంతకల్, గుత్తి , కడప, నందలూరు, రేణిగుంట, పాకాల, తిరుపతి, రాయచూరు రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గాలను దక్కించుకునేందుకు డివిజన్, బ్రాంచి స్థాయిలో సౌత్‌సెంట్రల్ మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్‌లు తమ ప్యానెల్ తరపున అభ్యర్థులను ఎన్నికల బరిలోకి దింపాయి.

తొలివిడతలో నందలూరులో పోలింగ్..

రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గ ఎన్నికలలో భాగంగా తొలివిడతగా నందలూరు రైల్వే కేంద్రంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గం ఎన్నికలకు పోలింగ్‌ను ఈనెల 5న నిర్వహించేందుకు డివిజన్ పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఇప్పటి వరకు నందలూరులో వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు కమలా మనోహర్, చెంచురెడ్డి ఆధ్వర్యంలో నామినేషన్ల వ్యవహారంతోపాటు గుర్తుల కేటాయింపు కార్యక్రమాలను చేపట్టారు.



రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల బ్యాలెట్ నమూనా

ప్రచారంలోకి దిగిన యూనియన్, సంఘ్‌నేతలు

నందలూరులో మజ్దూర్ యూనియన్ తరపున సెక్రటరీగా పోటీ చేస్తున్న విశ్వనాథ్‌కు బస్సు గుర్తు, ఎంప్లాయిస్ సంఘ్ తరపున సెక్రటరీగా పోటీచేస్తున్న కృష్ణమూర్తికి పులి గుర్తును కేటాయించారు. ఇరు ప్యానెళ్లలో జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్‌తోపాటు డైరెక్టర్ల స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థులకు వేర్వేరుగా గుర్తులు ఇచ్చారు. గతంలో కామన్ సింబల్‌తో ఎన్నికలు జరిగేవి. అయితే ఒక కార్మికసంఘం దీనిని వ్యతిరేకించింది. దీంతో సింబల్ వివాదం నెలకొంది. దీంతో ఈనెల 2న జరగాల్సిన ఎన్నికలను 5వ తేదీకి వాయిదా వేశారు. దీంతో తమ తమ ప్యానెల్‌ను గెలిపించుకునేందుకు మజ్దూర్ యూనియన్, సంఘ్ నేతలు ముమ్మర ప్రచారం చేపట్టాయి.

నేటి నుంచి ట్రిపుల్ ఐటీలో ఇంటర్వ్యూలు

వేంపల్లె : మండలంలోని ఆర్జీయూకేటీ పరిధి ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో గెస్ట్ ఫ్యాకల్టీకి సంబంధించి బుధవారం నుంచి శుక్రవారం వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1న పీయూసీలోని బయాలజీ, తెలుగు, మాథమ్యాటిక్స్, ఇంగ్లిషు, 2న కెమిస్ట్రీ, సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, 3న ఫిజిక్స్ సబ్జెక్టులకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌జియూకెటి.ఎసి.ఇన్ అనే వెబ్‌సైట్‌ను సంప్రదించాలని వివరించారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం



రైతులకు మెగా చెక్‌ను అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారులు

- రైతు భరోసా కింద 2,01,385 మంది రైతులకు రూ. 41,63,500
- ఇన్‌పుట్ సబ్సిడీ కింద 1666 మంది రైతులకు రూ.12,276 లక్షలు
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిధులు విడుదల చేసిన సీఎం
- మాండోస్ తుఫాన్ ప్రభావిత నష్టపరిహారం కింద 1666 మంది రైతులకు 122.76లక్షల పంపిణీ

రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. రైతు సంక్షేమానికి ఎన్నో పథకాలు తీసుకొచ్చి ఆదుకుంటోంది. అందులో భాగంగానే మంగళవారం రైతు భరోసా నిధులతోపాటు మాండూస్ తుపాను వల్ల దెబ్బతిన్న వివిధ పంటలకు నిధులను విడుదల చేసింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తెనాలిలో నిర్వహించిన బహిరంగసభ అనంతరం వర్చువల్ విధానంలో సంబంధిత నిధుల విడుదలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆధ్వర్యంలో రైతులకు మెగా చెక్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఏడాది వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ నగదు పంపిణీతో పాటు 2022లో మాండూస్ తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నిధులను రైతుల ఖాతాలో జమ చేసినట్లు వ్యవసాయ అధికారి వివరించారు. జిల్లాలో 2,01,385 మంది రైతులకు రూ. 41,63,500 మెగా చెక్కును పంపిణీ చేశామన్నారు. అదే విధంగా తుపాను ప్రభావంతో నష్టపోయిన 1666 మంది రైతులకు రూ.12,276 లక్షల విలువ గల చెక్కును కూడా అందజేశామన్నారు. రైతులకు సాగు ఖర్చు కింద పెట్టుబడి సాయం అందించాలనే ఉద్దేశంతో అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.13,500ల చొప్పున వైఎస్సార్ రైతు భరోసా కింద, పీఎం కిసాన్ పథకం ద్వారా ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిధులు రైతులకు పంటల సాగు కోసం ఎంతో ఉపకరిస్తున్నాయని ఆమె చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

యార్డులో రెండో రోజూ కొనుగోళ్లు బంద్

కడప అగ్రికల్చర్: కడప వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పడిన శీతల గిడ్డంగి నిర్మాణ పనుల వివాదం కారణంగా రెండో రోజు కూడా కమీషన్ ఏజెంట్లు కొనుగోళ్లను బంద్ చేశారు. మార్కెట్‌యార్డు నిబంధనలకు విరుద్ధంగా పండ్లవ్యాపారి చేపట్టిన శీతల గిడ్డంగి నిర్మాణ పనులను రెండవ రోజు కూడా కొనసాగించారు. కోర్టు ఉత్తర్వులతో పండ్లవ్యాపారి పనులను చేపట్టడంతో మార్కెట్ యార్డు సిబ్బంది ఎలాంటి చర్యలు చేపట్టలేకపోయారు. ఈ వివాదం విషయమై మంగళవారం ఆర్‌డీఓ ధర్మచంద్రారెడ్డి మార్కెట్‌యార్డును సందర్శించి పరిశీలించారు.

అనంతరం మార్కెట్‌యార్డు కార్యాలయంలో యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్య, జేడీ రామాంజనేయులతో చర్చించారు. పండ్లవ్యాపారి కోర్టు ఉత్తర్వులు తెచ్చుకుని పనులను చేపట్టడంతో.. జాగ్రత్తగా కోర్టు ద్వారానే పనులను నిలిపివేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతోపాటు రైతులకు సంబంధించిన పంట ఉత్పత్తుల కొనుగోలుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు.